క్లుప్తంగా

నాగన్నకుంటలో దీపోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని 22వ వార్డు నాగన్నకుంటలో వేంచేసి ఉన్న కార్య సిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా మంగళవారం రాత్రి దీపోత్సవం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామ, ఆంజనేయస్వామి భజన బృందం వారు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారి దీపోత్సవంలో 500 మంది మహిళలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారని ఆలయ పండితులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన రావిక్రింది మల్లికార్జునరావు, జింకా రామారావు, పోత్తూరి దుర్గారావు, కాసాని శ్రీనివాసరావు, 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు ప్రసన్నాంజనేయుని ఆలయానికి భూమి పూజ

బెల్లంకొండ: కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని ఆలయానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 9.35 గంటలకు మంత్రులు కొట్టు సత్యనారాయణ, అంబటి రాంబాబు, స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించి బుధవారం ఎంపీపీ ఆలయ కమిటీ సభ్యులతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

ఆదర్శ ఉద్యోగులే స్ఫూర్తి

సత్తెనపల్లి: ఆదర్శ ఉద్యోగులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జోన్-3 డిప్యూటీ సీఎంఈ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సత్తెనపల్లి ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈ సభకు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జోన్-3 డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి లక్ష్య సాధనకు కృషి చేయాలని, ఆదర్శవంతంగా పనిచేసే వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా 2023 నవంబర్‌లో కేఎంపీఎల్ అత్యధికంగా సాధించిన డ్రైవర్లు, టార్గెట్ ఎర్నింగ్‌పై అత్యధిక లక్ష్యాన్ని సాధించిన కండక్టర్లను అభినందించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లలో కె.కోటేశ్వరరావు, షేక్ చాంద్ బాషా, టార్గెట్ ఎర్నింగ్‌పై అత్యధిక లక్ష్యం సాధించిన కండక్టర్లలో పీఎస్ కిరణ్, టీకే రావు, కె అంకయ్య ఉన్నారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, డిపో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తాం



రాజుపాలెం: తుఫాన్ వలన పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని, తగిన న్యాయం చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. నకరికల్లు మండలంలోని చల్లగుండ్ల, దేచవరం గ్రామాలలో తుఫాన్ వలన నష్టపోయిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. శనగ, కంది పంటలను పరిశీలించి 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రైతులతో మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. శనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ విత్తనాలను రాయతీపై పంపిణీ చేస్తారని తెలిపారు. ఎన్యూమరేషన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల వ్యవసాయాధికా రి కె.దేవదాసు, దేచవరం ఉప సర్పంచ్ రమణారెడ్డి, వీఆర్వో యువరాజు, వ్యవసాయ సహాయకులు దిలీప్‌కుమార్, కె.రవిబాబు, రైతులు ఉన్నారు.

పాడ్యమి పూజలతో ముగిసిన కార్తీకమాసం

అమరావతి: పంచారామక్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం చివరిరోజు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక అమావాస్య అనంతరం పాడ్యమి పర్వదినాన ఆలయాన్ని సందర్శించిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద అలాగే పవిత్ర కృష్ణానదిలో కార్తీకదీపాలను వదిలారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్తీక మాసం ఆఖరిరోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈవో వేమూరి గోపినాధ శర్మ మాట్లాడుతూ కార్తీకమాసం పరవడి దినాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లకు సహకరించిన అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ అవసరం ఉంది

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ఊటుకూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



ఊటుకూరులో సంక్షేమం, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఊటుకూరు(క్రోసూరు): రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే వైఎస్ జగన్ మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఉందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. జగనన్న సీఎం అయితేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తే.. ఇవ్వని హామీలు కూడా నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదలకు అన్ని రకాలుగా అండగా నిలిచారన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ష్యూరిటీ.. గ్యారంటీ అంటూ వస్తున్నారని మండిపడ్డారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేయలేని పనులను నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ చేసి చూపించారన్నారు. ఊటుకూరు గ్రామంలో రూ.1.71 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.40 లక్షలతో సచివాలయం, రూ.15 లక్షలతో ముస్లిం కమ్యూనిటీ హాల్, రూ.15 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, నాడు నేడు ద్వారా రూ.45 లక్షలతో స్కూళ్లు బాగు చేశామన్నారు. ఎస్సీ కాలనీల్లో రూ.20 లక్షలతో రోడ్లు వేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.20 లక్షలతో కూడా సీసీరోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయానికొస్తే.. రూ.28.59 కోట్లు డీబీటీ ద్వారా, రూ.14.97 కోట్లు నాన్ డీబీటీ ద్వారా అందించామన్నారు. తమ ప్రభుత్వం చేసిన దాంట్లో కనీసం పది శాతమైనా టీడీపీ చేసిందా అని ప్రశ్నించారు. కార్యకర్తలు, నాయకులు కూడా జగనన్న పాలనలో జరిగిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఊటుకూరు టీడీపీ కార్యకర్తలు..



ముఖ్యమంత్రి జగనన్న హయాంలో పేదలకు జరుగుతున్న మంచి చూసి ప్రతిపక్షాల నాయకులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. క్రోసూరు మండలం ఊటుకూరులో టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో బంకా శామ్యూల్, మేదర సుభాని, మేదర ఏషియా, మేదర యాకోబు, మేదర నాగయ్య, జెర్రిపోతు బేబి తదితరులున్నారు.

మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి

- 21న ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : పట్టణంలో ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 51వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ స్థాయిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జరిగిన సత్తెనపల్లి రూరల్ మండల వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏడాది 806 మంది రక్తదానం చేశారని, ఈ ఏడాది 1000 మంది రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.
సమష్టిగా ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులకు కార్డులు అందించి లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తంరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ పంచుమర్తి అప్పారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదమంచి రాంబాబు, నాయకులు గోపిదేశి శివయ్య, నందిగం యల్లమంద, జంగాల సంపత్, ఆళ్ళ జగన్నాథం, కాశామాల ఓబయ్య, ఈవూరి బ్రహ్మరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, తదితరులున్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న జోన్-2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు

సత్తెనపల్లి: ప్రాణాంతక ఎయిడ్స్/హెచ్‌ఐవీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీఎస్ఏసీఎస్, చైల్డ్ ఫండ్ ఇండియా వారి ఆధ్వర్యంలో లింక్ వర్కర్స్ స్కీం కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ గురించి లింక్ వర్కర్స్ స్కీం పనిచేస్తుందని, గ్రామాల్లో హైరిస్క్ వారిని గుర్తించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడం? వారికి పరీక్షలు నిర్వహించి హెచ్‌ఐవీ స్టేటస్ గుర్తించి తక్షణమే మందులు ఇప్పించడం వలన వారి జీవితకాలాన్ని పెంచవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం మంచిదని, ఇది ప్రజలకు చాలా ఉపయోగపడుతుందన్నారు. దీనికి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. జోన్-2 సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో హైరిస్క్ వారిని గుర్తించి వారికి హెచ్‌ఐవీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. లింక్ వర్కర్స్ స్కీం అనేది గ్రామ స్థాయిలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన, వివక్షతల గురించి పనిచేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే హెచ్‌ఐవీ ఎక్కువగా ఉందని, గుంటూరు జిల్లాలో లింక్ వర్కర్ స్కీం 100 గ్రామాల్లో పని చేస్తుందన్నారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయితేజరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడానికి వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. హైరిస్క్ వర్గాల వారికి ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్ ఔషధాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, సీహెచ్ఓ వి.సీతారావమ్మ, ఎంపీహెచ్ఈవో పిట్టల శ్రీనివాసరావు, ఎల్‌టీ అనిల్, లింక్ వర్కర్ అరుణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

బలుసుపాడులో వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజకు సిద్ధం చేసిన మంటపం



పడిపూజకు హాజరైన భక్తులు

- భక్తి పరవశంతో భక్తులు
- పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: మండలంలోని బలుసుపాడు భ్రమరాంబిక సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పడిపూజకు అయ్యప్పస్వామి భక్తులు, అయ్యప్పలు, అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో పాటలు పాడారు. 18 పడిమెట్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ స్వర్ణకుమారి, జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు బచ్చు హనుమంతురావు, కంకణాల శివాజీ, ఎంపీటీసీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ఒకరికి తీవ్ర గాయాలు

నార్నెపాడు(ముప్పాళ్ళ): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని నార్నెపాడు సమీపంలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నార్నెపాడుకు చెందిన నలుగురు యువకులు ఆటోలో ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి వెళ్లి వస్తుండగా నార్నెపాడు గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఆటోలో ఉన్న పిల్లి అనిల్‌కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వేద విద్యార్థినులకు సేవా సర్టిఫికెట్స్

సత్తెనపల్లి: వేద విద్యార్థినులు సేవా అవార్డ్స్ అందుకోవడం అభినందనీయమని వేద నర్సింగ్ స్కూల్ డైరెక్టర్ చింతాడ రమేష్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఉత్తమ సేవలందించిన వేద నర్సింగ్ విద్యార్థినులకు పల్నాడు జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎక్సలెంట్ సర్వీస్ సర్టిఫికెట్‌లను బుధవారం ప్రదానం చేశారు. అక్టోబర్ 12 నుంచి నవంబర్ 8 వరకు ఆరోగ్య శిబిరాలలో గృహ సందర్శనలో ఆరోగ్య సిబ్బందికి నర్సింగ్ విద్యార్థులు సహకరించారు. సత్తెనపల్లి పట్టణం, ముప్పాళ్ళ, పణిదం, పెదకూరపాడు మండలాల్లో ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పాల్గొని రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించటంలో వైద్యులకు సహకరించారు. పట్టణంలో వివిధ వార్డులలో జరిగిన సురక్ష శిబిరాల్లో విద్యార్థులు అందించిన సేవలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ముప్పాళ్ళ, పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణులు రమాదేవి, కవిత, అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యులు గుజ్జర్లపూడి ధర్మ, సుభానిలు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడిమాలతీ, సరిత, సూర్య, అధ్యాపకులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

యువతలో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- క్రీడా కిట్లు పంచాయతీ కార్యదర్శులకు అందజేసిన ఎమ్మెల్యే



పంచాయతీ కార్యదర్శులకు క్రీడాకిట్లను అందచేస్తున్న ఎమ్మెల్యే నంబూరుశంకరరావు.

క్రోసూరు: యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రతిభ ఉన్న క్రీడాకారులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు తెలిపారు. క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో పోటీలను నిర్వహించేందుకు అవసరమైన క్రీడా సామగ్రిని మండల పరిధిలోని సచివాలయాలకు అందజేశారు. క్రికెట్ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంచడం, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో డిసెంబర్ 15 నుంచి పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమపేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో విజేతలకు బహుమతులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిభ ఉండి ప్రోత్సాహం అందక వెనకబడిపోయిన వారి కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, సయ్యద్ అబ్దుల్ రహీం, మర్రి శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

నేవీ క్విజ్‌లో రాణించిన 75త్యాళ్ళూరు విద్యార్థులు



పెదకూరపాడు: భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన ది ఇండియన్ నేవీ క్విజ్ క్వార్టర్ ఫైనల్లో 75త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు పీవీ శివాంజన్, వెంటక మహినకంఠలు ప్రతిభ కనబరిచారు. బుధవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయులు సుబ్బారావు అభినందించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పన్నెండు వేల మంది విద్యార్థులు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. క్వార్టర్ ఫైనల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అచీవ్‌మెంట్ సర్టిఫికెట్ సాధించారన్నారు. విద్యార్థులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య
- సీపీఎం పల్నాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశం

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్‌తో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని, వర్షాభావంతో పంటలు వేయని రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.రాధాకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగిన సీపీఎం పల్నాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్నాడు జిల్లాలో కలెక్టర్ గుర్తించిన 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని అన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులైన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం బోర్డు నిధులు వెంటనే జమ చేయాలన్నారు. వరికపూడిశెలకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించి ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. సత్తెనపల్లికి బైపాస్ రోడ్డు రావడాన్ని సీపీఎం స్వాగతిస్తుందన్నారు. ముందుగా ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు వాసుదేవ ఆచార్య, శంకరయ్య, యూటీఎఫ్ నాయకులు దత్తులకు సమావేశం సంతాపం ప్రకటించింది. సమావేశంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఏపీఎస్ గోపాలరావు, ఎస్.ఆంజనేయ నాయక్, కమిటీ సభ్యులు సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, బాలకృష్ణ, మల్లేశ్వరి, శివకుమారి, విమల,మహేష్, పెద్దిరాజు, ఉమాశ్రీ పాల్గొన్నారు.

బొల్లవరంలో ఫ్యామిలీ డాక్టర్



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ పాల్గొని 87 మందికి వైద్యసేవలందించారు. వీరిలో17 మందికి సాధారణ పరీక్షలు, 37 మందికి బీపీ పరీక్షలు, 24 మందికి షుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లను అందించారు. అనంతరం అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారికి అవసరమైన వైద్య సేవలందించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. డీఈఓ కె.రవితేజ, ఎంపీహెచ్ఏ మస్తాన్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలబాట ద్వారా విద్యా సేవలు

సత్తెనపల్లి: ఎంతోమంది పేద విద్యార్థులకు బాలబాట ద్వారా విద్యాపరంగా ఎన్నో సేవలు అందిస్తున్నామని కార్ప్ సంస్థ ప్రకాశం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఉత్తమ బాల ఉపాధ్యాయులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి సత్తెనపల్లి ఏరియా కోఆర్డినేటర్ జి.రవి అధ్యక్షత వహించారు. గత 23 సంవత్సరాల నుంచి బాలల విద్యాభివృద్ధికి బాలబాటలు పనిచేస్తున్నాయని, ప్రతి ఏడాది పేద విద్యార్థులను గురుకులాల్లో చేర్పించడం ద్వారా వారికి మెరుగైన విద్య అందుతుందన్నారు. అనంతరం ఉత్తమ బాల ఉపాధ్యాయులకు ప్రకాశం జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

రజకులకు అండగా ఉంటా

క్రోసూరు: రజకులకు అండగా ఉంటానని ఏపీ రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. క్రోసూరులోని రజక సంఘ కుల పెద్దలు, నాయకులతో ప్రస్తుత రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించారు. స్థానికంగా రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, అనేక రకాల డిమాండ్లను సంఘ పెద్దలు తెలియజేయగా, సదరు సమస్యల పరిష్కారానికి తన వంతు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. రజకులు రాజకీయంగా చైతన్యవంతం కావాలని రాజ్యాధికారం దిశగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని హితవు పలికారు . ముందుగా ఇటీవల క్రోసూరుకు చెందిన క్రోసూరు శివరాం మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని చెప్పారు. క్రోసూరు మండలం వైఎస్సార్‌సీపీ బీసీ సంఘం అధ్యక్షులు కోనంకి గురునాథం, పెదకూరపాడు నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు దాసరి తిరుపతిరావు, పూరే రోశయ్య, కడప శ్రీను, క్రోసూరు రాంబాబు, కంబాల కాశయ్య, బలుసుపాటి వెంకటేశ్వర్లు, క్రోసూరు వేణు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ముప్పాళ్ళ, నకరికల్లు మండలానికి చెందిన ఇరువురు బాధితులకు రూ.88 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పంపిణీ చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం చెక్కులను స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆరోగ్యశ్రీ తోడ్పాటు అందిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తంరావు, రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదమంచి రాంబాబు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

16న వైఎస్సార్ మెమోరియల్ జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్

క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సౌజన్యంతో ఈ నెల 16న డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యుడు కాల్వపల్లి సురేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. క్రోసూరులోని కెనాల్స్ కార్యాలయ ఆవరణలో 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు టోర్నమెంట్‌ను ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు, నాల్గవ బహుమతి రూ.2 వేలు అందించనున్నట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన రవి స్పోర్ట్స్ నిర్వాహకులు షటిల్‌కాక్స్ అందచేస్తున్నట్లు వివరించారు. ఎంట్రీఫీజు రూ.400 గా తెలిపారు. వివరాలకు 9393744344, 9908487851 నంబర్లకు ఫోను చేయాలని కోరారు.